నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 20-1-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 144 పేజీలు: 4 వెల: రూ.1/-

వివరాలు 4వ పేజీలో...

చివరి వరకూ నరాలు తెగే ఉత్కంఠ టీమిండియాది చారిత్రక విజయం

టీమిండియాపై ప్రశంసలు కురిపించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జనవరి19(ఆర్ఎన్ఎ): ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా చరిత్రాత్మక విజయంపై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. భారత జట్టు విజయానికి దేశమంతా గర్వస్తోందని మోదీ పేర్కొన్నారు. ఆటగాళ్లు తమ అభిరుచి, అద్భుతశక్తిని ప్రదర్శించారు అని మోదీ కొనియాడారు. భారత జట్టుకు మోదీ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. టీమిండియా అనితర సాధ్యమైన విజయం సాధించింది. 32 ఏళ్లుగా ఓటమెరుగని బ్రిస్బేన్‌లో కంగారూల పని పట్టింది. గబ్బా కోటను బద్దలు కొట్టింది. 3 వికెట్ల తేడాతో చివరి టెస్ట్‌లో గెలిచి 2-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. యువ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్ (91), రిషబ్ పంత్(89 నాటౌట్) ÷టింగ్ ఇన్నింగ్స్‌తోపాటు ఆస్ట్రేలియా పేసర్ల బౌన్సర్లకు శరీరమంతా గాయపడినా పోరాడిన పుజారా (56) టెస్ట్ క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే అద్భుతమైన విజయాన్ని సాధించిపెట్టారు. 328 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా ఛేదించడం విశేషం. చివరి వరకూ నరాలు తెగే ఉత్కంఠ మధ్య జరిగిన ఈ మ్యాచ్.. టెస్ట్ క్రికెట్‌లోని అసలైన మజాను రుచి చూపించింది. దీంతో ప్రధాని ఈ మ్యాచ్ చిరస్మరణీయమని అభినందించారు.

టీమిండియాను అభినందించిన కెసిఆర్, కెటిఆర్

జట్టు సభ్యులకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): ఆస్ట్రేలియా గడ్డపై చరిత్రాత్మక విజయం సాధించిన టీమిండియాకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కీలక ఆటగాళ్లు లేకున్నా అద్భుతం చేశారని కేసీఆర్ ప్రశంసించారు. ఈ విజయం చిరస్మరణీయంగా మిగిలిపోతుందన్నారు. కెప్టెన్ రహానేతో పాటు జట్టు సభ్యులకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

టీమిండియా ఆటగాళ్లు భారత్‌ను గర్వించేలా చేశారు అని పేర్కొంటూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోయే విజయమని పేర్కొన్నారు. 2021 సంవత్సరాన్ని అద్భుతంగా ప్రారంభించారు అని కేటీఆర్ అన్నారు. గబ్బాలో టీమిండియా అనితర సాధ్యమైన విజయం సాధించింది. 32 ఏళ్లుగా ఓటమెరుగని బ్రిస్బేన్‌లో కంగారూల పని పట్టింది. గబ్బా కోటను బద్దలు కొట్టింది. 3 వికెట్ల తేడాతో చివరి టెస్ట్‌లో గెలిచి 2-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. యువ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్ (91), రిషబ్ పంత్(89 నాటౌట్) ÷టింగ్ ఇన్నింగ్స్ తోపాటు ఆస్ట్రేలియా పేసర్ల బౌన్సర్లకు శరీరమంతా గాయపడినా పోరాడిన పుజారా (56) టెస్ట్ క్రికెట్ చరిత్రలో నిలిచిపోయే అద్భుతమైన విజయాన్ని సాధించిపెట్టారు. 328 పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా ఛేదించడం విశేషం. చివరి వరకూ నరాలు తెగే ఉత్కంఠ మధ్య జరిగిన ఈ మ్యాచ్.. టెస్ట్ క్రికెట్‌లోని అసలైన మజాను రుచి చూపించింది.

గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నిద్రిస్తున్న కూలీలపై దూసుకెళ్లిన ట్రక్కు

15మంది అభాగ్యుల మృతి

తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, సిఎం రూపానీ

గాంధీనగర్,జనవరి19(ఆర్ఎన్ఎ): గుజరాత్‌లోని కొసంబా జిల్లాలో సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రక్కు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కూలీల పైనుంచి దూసుకెళ్లడంతో 15 మంది ఘటనాస్థలం లోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగు రికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను, క్షతగాత్రులను రాజస్థాన్‌లోని బన్స్‌వాడ జిల్లాకు చెందిన వలస కూలీలుగా గుర్తించారు. వేగంగా వెళ్తున్న ట్రక్కు ఎదురుగా చెరుకు లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని అదుపుతప్పి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కూలీల పైనుంచి దూసుకెళ్లిందని కంరేజ్ డివిజన్ డీఎస్పీ సీఎం జడేజా తెలిపారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప దవాఖానల కు తరలించారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని మోదీతోపాటు రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలు కోవాలని ఆక్షాంచారు. మృతుల కుటుంబా లకు ఒక్కొక్కరికి ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు, గాయ పడిన వారికి రూ. 50 వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధాని ప్రకటించారు. గుజరాత్ ప్రభుత్వం సైతం బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షలు ఇవ్వనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ రుపాని ప్రకటించారు. ఘటన చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు.

సమర్థంగా కరోనా వ్యాక్సిన్ పనితీరు

ఆ ఇద్దరి మృతికి వ్యాక్సిన్‌తో సంబంధం లేదు తేల్చి చెప్పిన కేంద్ర ప్రభుత్వాధికారులు

న్యూఢిల్లీ,జనవరి19(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత ఇద్దరు ఫ్రంట్‌లైన్ వర్కర్స్ చనిపోగా, వీరి మరణాలకు, కరోనా వ్యాక్సిన్‌కు ఏ సంబంధం లేదని, గుండెపోటు కారణంగానే వారిద్దరూ చనిపోయారని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. వారిద్దరిలో ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారయితే, మరొకరు కర్ణాటకకు చెందినవారు. ఉత్తరప్రదేశ్‌లో మొరాదాబాద్‌కి చెందిన ప్రభుత్వ ఆసుపత్రి వార్డ్‌బారుగా పనిచేస్తున్న మహిపాల్ సింగ్ (46) వ్యాక్సిన్ తీసుకున్న 24 గంటల తర్వాత చనిపోయారు. కానీ కోవిడ్ వ్యాక్సిన్ వల్ల కాదని ఆ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టులో కూడా.. గుండె సంబంధ సమస్యతోనే చనిపోయినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే వారి కుటుంబ సభ్యులు కూడా వ్యాక్సిన్ తీసుకోవడానికి ముందే అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఇక రెండో వ్యక్తి కర్ణాటకలోని బళ్లారికి చెందిన నాగరాజు (43) ఏళ్ల వ్యక్తి. ఈయన కూడా గుండె సంబంధ సమస్యలతోనే చనిపోయినట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే పోస్టుమార్టం నిర్వహించలేదు. సరిగ్గా అదే వ్యాక్సిన్ తీసుకున్న హెల్త్ కేర్ వర్కర్స్‌కు ఎటువంటి ప్రతికూలచర్యలు కనిపించలేదని ప్రభుత్వం పేర్కొంది. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత రోజు ఉదయం పనికి వెళ్లిన తర్వాత గుండెలోనొప్పి అని ఫిర్యాదు చేయగా.. ఆసుపత్రిలో చేర్చినా.. ఫలితం లేకపోయిందని ప్రభుత్వం వెల్లడించింది. ఆయన మరణించిన అదేరోజు సాయంత్రం కర్ణాటక ఆరోగ్యశాఖామంత్రి కె సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ.. కరోనా వ్యాక్సిన్‌తో ఆయన చనిపోలేదని.. వ్యాక్సిన్ వల్ల గుండెనొప్పితో బాధపడలేదని.. ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తే అంతకుముందే.. డయాబెటిస్ ఉందని తెలిపారు. శనివారం వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా ఎటువంటి లక్షణాలు లేవు అని తెలిపారు. మూడురోజుల్లో మూడున్నర లక్షలమందికి పైగా వ్యాక్సిన్ వేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో వ్యాక్సిన్ వేసిన వారిలో 580 మందికి ప్రతికూలచర్యలు కనిపించినట్లు పేర్కొంది. అలాగే ఏడుగురు ఆసుపత్రిపాలైనట్లు తెలిపింది. ఏడుగరిలో ముగ్గురు ఢిల్లీకి చెందినవారు. ముగ్గురిలో ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారు. ఒకరు మాక్స్ ఆసుపత్రిలో పరిశీలనలో ఉన్నారు. అలాగే కర్ణాటక నుండి రెండు కేసులు నమోదయ్యాయి. అందులో ఒకరు పరిశీలనలో ఉన్నారు. ఇక ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఒకరు పరిశీలనలో ఉన్నారు. మరొక వ్యక్తి ఛత్తీస్‌ఘర్‌లోని రాజనందగాన్‌లో ఆసుపత్రి పాలయ్యారు.

సాగునీటి ముఖ చిత్రాన్ని మార్చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు

కరీంనగర్, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సాగునీటి ముఖ చిత్రాన్ని మార్చివేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన స్ఫూర్తితోనే దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన తూపాకులగూడెం బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన దుమ్ముగూడెం బ్యారెజీ నిర్మాణాలు శరవేగంగా జరగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నింటిని త్వరితిగతిన పూర్తి చేసి రైతుల సాగునీట గోసను శాశ్వతంగా రూపుమాపాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యం అని సీఎం కేసీఆర్ వెల్లడించారు. మంగళవారం మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీని సీఎం సందర్శించారు. సతీమణి శోభ, మంత్రులు, ఇతర నాయకులు, అధికారులతో కలిసి గోదావరి జలాలకు పుష్పాభిషేకం చేశారు. సాగునీరు లేక తెలంగాణ రైతాంగం దశాబ్దాల తరబడి గోసను అనుభవించిందని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న ఫలితం సంపూర్ణంగా దక్కాలంటే రైతులు రెండు పంటలను సమృద్ధిగా పండించేందుకు అవసరమైన సాగునీరు అందించి తీరాలని మొదట్లోనే నిర్ణయించు కున్నట్లు తెలిపారు. అటు ప్రాణహిత, ఇటు గోదావరి రెండు నదుల నీళ్లు కలిసిన తరువాత బ్యారేజీ నిర్మాణం చేపడితే ఎక్కువ కాలం పాటు కావలసినంత నీళ్లు పంపింగ్ చేయవచ్చని వ్యూహం రూపొందించామన్నారు. వ్యాప్కోస్ తో శాస్త్రీయంగా సర్వే నిర్వహించి మేడిగడ్డ పాయింట్ వద్ద బ్యారేజ్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అనుకున్న సమయంలో అనుకున్న విధంగా పూర్తయి నీటి పంపింగ్ కూడ నిరాటంకంగా జరుగుతుండడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడంలో కృషి చేసిన నీటిపారుదల శాఖాదికారులు, వర్కింగ్ ఏజెన్సీలు, ఇతర శాఖల ఉద్యోగులను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రస్తుతం బ్యారేజీల వద్ద పూర్తి స్థాయిలో నీరు నిలువ ఉందని, ఈ ఎండాకాలం అంతా ఈ నీటితో రాష్ట్రం లోని రిజర్వాయర్లు, చెరువులు, నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా ఆపరేషన్ రూల్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన స్ఫూర్తితోనే రాష్ట్రంలో చేపట్టిన ఇతర భారీ ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా ఎదురైన అనుభవాలను సీఎం గుర్తుచేసుకున్నారు. 16.17 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంతో దాదాపు 100 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మించడం వల్ల దాదాపు 7 నెలల పాటు నీటిని పంపింగ్ చేయవచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. అనుకున్నది అనుకున్నట్లుగా జరుగుతున్నది. 99.7 మీటర్ల ఎత్తులో 16.17 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. నిర్మాణాలన్నీ అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగినట్లు వెల్లడించారు. నీటి పంపింగ్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా జరుగుతుందన్నారు. మెడిగడ్డ పాయింట్ నుండి 54 కిలోమీటర్ల వరకు ప్రాణహిత లో, 42 కిలోమీటర్ల వరకు గోదావరిలో నీరు నిలువ ఉండడంతో జలకళ ఉట్టి పడుతోందన్నారు. బ్యారేజీలు సముద్రాలను తలపిస్తున్నాయి. ఏ సమయం ఎట్ల వచ్చినా మేడిగడ్డ నుండి ఎల్లంపల్లి, మిడ్ మానేరు, ఎల్ఎండి, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రతీ ఏటా నీరందుతుందని చెప్పారు. నిజాంసాగర్‌కు కూడా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే నీరందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అవసరమైన పక్షంలో ఎస్ఆర్ఎస్పీకి కూడా ఈ ప్రాజెక్టు నుండే నీటి పంపింగ్ చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ యజ్ఞంలా చేపట్టినట్లు తెలిపారు. 50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో కూడా వేలాది మంది కార్మికులు పనిలో నిమగ్నమై 365 రోజులు పనిచేసినట్లు చెప్పారు. భూసేకరణతో పాటు వివిధ క్రాసింగ్ లకు సంబంధించిన అంశాలను అధికారులు సమయోచితంగా, సమర్థంవంతంగా పరిష్కరించారని కొనియాడారు. మొత్తంగా రాష్ట్ర రైతాంగానికి ఎంతో ఆవశ్యకమైన ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రైతుల కల నెరవేరినందుకు, సాగునీటి సమస్య తీరుతున్నందుకు సంతృప్తిగా ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ, తుపాకుల గుడెం బ్యారేజి, దుమ్ముగూడెం బ్యారేజీల వల్ల కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని.. అన్ని ప్రాజెక్టులకు సంబంధించి ఆపరేషన్ రూల్స్ రూపొందించాలని.. సమయానుగుణంగా రూల్స్‌ను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నీటి పారుదలశాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్, సీఎం కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటిపారుదలశాఖ ఈఎన్‌సీలు మురళీధరర్ రావు, వెంకటేశ్వర్లు, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, పెద్దపలి-వరంగల్ రూరల్ జడ్పీ చెర్ పర్సన్లు పుట్ట మధు, గంధ్ర జ్యోతి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు గంధ్ర వెంకట్రామరెడ్డి, పోర్తిక చందర్, దివాకర్ రావు, మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పురాణం సతీష్, నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సిఎం కెసిఆర్ దంపతులు

శరవేగంగా దుమ్ముగూడెం బ్యారెజీ నిర్మాణాలు

తెలంగాణ నీటి గోసను తీర్చాలన్న సంకల్పంతోనే ప్రాజెక్టుల నిర్మాణం

మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీని సందర్శించిన సీఎం కెసిఆర్

శంషాబాద్ విమానాశ్రయంలో ప్లాజా ప్రీమియం లాంజ్ పునరుద్ధరణ

హైదరాబాద్, జనవరి 19: రాజీఎ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో డొమెస్టిక్ డిపార్చర్స్ వద్ద ప్లాజా ప్రీమియం లాంజ్ మంగళవారం ప్రారంభమైంది. ఇటీవల పునరుద్ధరించబడిన ప్లాజా ప్రీమియం లాంజ్‌ను సీఈవో ప్రదీప్ పణికర్ ప్రారంభించారు. డొమెస్టిక్ డిపార్చర్స్ విభాగంలో ఉన్న ఈ లాంజ్ 773 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించింది. 222 మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చోవచ్చు.

ప్లాజా ప్రీమియం లాంజ్‌లో ప్రయాణికుల కోసం వర్క్ స్టేషన్లు, వై-ఫై, ప్రత్యేక అతిథులు, వీఐపీల కోసం ప్రైవేట్ సీటింగ్ జోన్, లాంజ్ సీటింగ్ మొదలైనవి ఉన్నాయి.

ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి మసాజ్, వెల్‌నెస్ నడుపాయాలను ఎంచుకోవచ్చు. ప్రీమియం ప్లాజా లాంజ్‌లోని రెక్లైనర్ సీట్లలో కూర్చుని విమానాశ్రయ రన్‌వే సుందర దృశ్యాలను వీక్షించవచ్చు. బార్ నుండి వారికిష్టమైన కాక్‌టెయిల్ లేదా మాక్‌టెయిల్‌ను సిప్ చేయవచ్చు. ప్రయాణీకులు ఎంపిక చేసుకోవడానికి బార్‌లో ప్రపంచ స్థాయి బ్రాండ్ల మద్యాలు లభిస్తాయి. లాంజ్‌లో సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రయాణికుల కోసం లాంజ్‌లో విస్తృతమైన బఫే ఏర్పాట్లు చేసారు.

జోన్ వారీగా సంగీత నియంత్రణ, యాంబియంట్ టెంపరేచర్ సెట్టింగ్, పిల్లలకు ప్రత్యేక కుర్చీలు ఇక్కడున్న మరికొన్ని ప్రత్యేక సదుపాయాలు. ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రయాణికుల కోసం ప్రత్యేకమైన వాష్‌రూమ్ సౌకర్యం, బేబీ కేర్ ఫెసిలిటీ కూడా అందుబాటులో ఉన్నాయి. లాంజ్‌లో ఏర్పాటు చేసిన అనేక స్క్రీన్‌ల ద్వారా ప్రయాణీకులు తమ విమాన షెడ్యూల్ అప్‌డేట్ సమాచారాన్ని పొందవచ్చు. సీసీటీవీ కెమెరాల ద్వారా లాంజ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నందున సాధారణ ప్రయాణికులతో పాటు వీఐపీలు, ప్రత్యేక అతిథులకు కూడా అత్యధిక భద్రత లభిస్తుంది. ప్రయాణీకుల అవసరాలను తీర్చడానికి, వారి ప్రయాణ అనుభవాన్ని మరపురానిదిగా చేయడానికి ఈ లాంజ్ 24 గంటలూ తెరిచే ఉంటుంది.

ప్రముఖ క్యాన్సర్ వైద్యురాలు శాంత మృతి

సంతాపం ప్రకటించిన ప్రధాని మోడీ

చెన్నై,జనవరి19(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌లో పేరు గడించిన డాక్టర్ వి.శాంత మంగళవారం కన్నుమూశారు. 93 ఏళ్ల శాంతకు ఛాతీ నొప్పి రావడంతో మంగళవారం చెన్నైలోని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆమె గుండెలో బ్లాక్ ఏర్పడిందని, దాన్ని తొలగించడం సాధ్యపడదని డాక్టర్లు చెప్పారు. ఆ తర్వాత ఆమె ట్రీట్‌మెంట్ పొందుతూ మృతి చెందారు. క్యాన్సర్ కేర్ కోసం శాంత చాలా కృషి చేశారు. ముఖ్యంగా తమిళనాడులో అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పడంలో ఆమె తీవ్రంగా కష్టపడ్డారు. ఆ ఇన్‌స్టిట్యూట్‌లో పేషెంట్స్ ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా హెల్త్ కేర్ అందిస్తున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు చైర్‌పర్సన్‌గా శాంత బాధ్యతలు నిర్వర్తించారు. శాంత మృతి పై ప్రధాని మోడీ సంతాపం వ్యక్తం చేశారు. టాప్ క్వాలిటీ క్యాన్సర్ ట్రీట్‌మెంట్‌ను అందించడంలో ఆమె విశేషమైన కృషి చేశారని మోడీ గుర్తు చేశారు. అణగారిన, పేద వర్గాలకు చెందిన క్యాన్సర్ పేషెంట్స్‌కు సేవలు అందించడంలో అడయార్ ఇన్‌స్టిట్యూట్ ముందుందని ప్రశంసించారు. శాంత మృతి తనను కలచివేసిందని ట్వీట్ చేశారు.

ప్రతి ఏడాదీ జనవరి 23ను పరాక్రమ దివస్‌గా నిర్వహించనున్నట్టు ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్, జనవరి 19: జనవరి 23ను పరాక్రమ్ దివస్‌గా ప్రకటిస్తూ గెజెట్ నోటిఫికేషన్ జారీ అయింది. నేతాజీ సుభాస్ చంద్ర బోస్ 125వ జయంతి సంవత్సరాన్ని జనవరి 23, 2021న జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమాలు నిర్ణయించడానికి, స్మారకోత్సవాన్ని పర్యవేక్షించి, మార్గదర్శనం చేయడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. నేతాజీ అనన్యమైన స్ఫూర్తిని, దేశానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలను జ్ఞాపకం చేసుకుని, గౌరవించడానికి భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజు అయిన జనవరి 23ను ప్రతి ఏడాది పరాక్రమ దివస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు నేతాజీ వలె ప్రతికూల పరిస్థితుల్లో కూడా ధైర్యంగా వ్యవహరించడంలో స్ఫూర్తిని నింపేందుకు, దేశ భక్తిని పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకుంది.

త్వరలో విద్యా సంవత్సరంపై ప్రకటన : మంత్రి సబిత

హైదరాబాద్, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల విద్యా సంవత్సరాన్ని త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు.

వచ్చే నెల ఒకటి నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మంగళవారం మంత్రి ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి, పాఠశాలల పునఃప్రారంభానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

ఈ సందర్భంగా 14 డిమాండ్లను పరిష్కరించాలని పాఠశాలల ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అంచెలంచెలుగా అన్ని తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు ఏడాదిగా ఫీజులు లేనందున పాఠశాలలు నిర్వహణ కష్టతరంగా మారిందని యాజమాన్యాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జూన్ వరకు విద్యా సంవత్సరం నిర్వహించాలని.. కనీస హాజరు ఉండేలా నిబంధన పెట్టాలని కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం.

సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో కొవిడ్ నిబంధనలు పాటిస్తూ విద్యాబోధన చేపట్టాలన్నారు.

వివిధ తరగతుల్లో సిలబస్ తగ్గింపుపై త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు ప్రారంభించేందుకు సిద్ధం కావాలని.. ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి కోరారు. కరోనాపై అవగాహన కల్పిస్తూ.. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాలల యాజమాన్యాలకు సూచించినట్లు చెప్పారు. పాఠశాలలకు సంబంధించి పలు సమస్యలను ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, ప్రభుత్వం తరపున సాధ్యమైనంత వరకు వారి సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు పాఠశాలలకు హాజరుకావాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. పాఠశాలకు హాజరవని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వినేలా ఏర్పాట్లు చేయాలని సూచించామన్నారు.

చరిత్రలో నేటినిజం



కళా కార్తీక చంద్రుని కి
నాట్యాభి మాలగించిన కలిమి ఆదిమధ్యనిగా
స్ఫూర్తి నాసంగెడి నటుని కి
తీర్చుచు నుంటి ఘనుని "కృష్ణంరాజు"కు !!

జనవరి 20 రెబెల్‌స్టార్, నేత కృష్ణంరాజు జయంతి...

-రాధశ్రీ

సెల్: 9494481210



కలగా మిగిలిన పక్కా ఓటు నమోదు

నేటినిజం
బుధవారం 20-1-2021

ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నా ఎన్నికల నిర్వహణలో మనం ఇంకా వెనకబడే ఉన్నామని చెప్పుకోవాలి. ప్రధానంగా ఓటు అన్నది ఉందో లేదో తెలియని అయోమయంలోకి ఓటర్లను నెడుతున్నారు. జనవరి 25న ఓటరు దినోత్సవాన అట్టహాసాలు చేస్తున్నా.. పక్కాగా ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించ లేని దౌర్భాగ్య స్థితిలో మన పాలకులు ఉన్నారు. ఓటు నమోదు చేసుకోవాలంటూ ఏటా సభలూ సమావేశాలు, ర్యాలీలు తీస్తున్నారు. అయినా పక్కాగా కార్యక్రమాలు జరగడం లేదు. ఓటు పోయిందన్న దానికి ఎదవరు కూడా బాధ్యత తీసుకోవడం లేదు. జాబితాలో పేరున్నా...ఓటేసేందుకు వెళితే అక్కడి జాబితాలో మయమవుతున్న ఘటనలు కోకొల్లు. ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేస్తోన్నా పక్కాగా ఓటు నమోదు అన్నది ప్రహసనంగా మారింది. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా మారంది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాతి కాలంలొ రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవకతవకలు బయటపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిపైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బంది పైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉంటారు. అటువంటప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం కలుగుతోంది. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. దీనికి పక్కా విధానం అమలు కావాల్సి ఉంది. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకుంటే అలాగే ఉంటుంది. పాన్ కార్డు నమోదయితే ఉంటుంది. ఓటు నమోదయితే ఉండడం లేదు. అలాగే ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ ఉంటే ఇలాంటి తొలగింపు అవకాశాలు ఉండవు. ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్నికల సంఘం గుర్తించడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న ఎన్నికల సంఘం ఈ మధ్య అనేక వివాదాల్లో చిక్కుకుంటోంది. విపరీత మైన అధికారాలు కలిగి ఉన్నా సమర్థత ప్రదర్శించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దొంగ ఓట్ల విషయం లో కూడా ఇసి సరైన చర్యలు తీసుకోవడం లేదు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. ఎన్నికలు ఎప్పుడు రిగినా నామినేషన్ వేయడానికి గడువు ముగిసే క్షణం వరకూ కొత్త ఓట్లను చేర్చుకునే పక్రియ కొనసాగుతోంది. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రమేయం తో ఓట్ల తొలగింపు జరుగుతోందన్న వాదన ఉంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. దొంగ ఓట్లను తొలగించాలనే పట్టుదల కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నిజంగా ఉంటే అందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని తగినంతగా సమకూర్చాలని రాష్ట్రపతిని అభ్యర్థించాలి. నామినేషన్ల గడువు ముగియడానికి ముందు ఉన్న ఓట్లకు పదిహేను లేదా ఇరవై శాతం కొత్త

ఓట్లు నమోదు చేస్తున్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత దొంగ ఓట్లను గుర్తించి, తొలగించడానికి తగిన సమయం ఉండటం లేదు. అక్రమాలు జరిగినట్టు తెలుసుకొని ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత అధికారు లపైన ఎటువంటి చర్య తీసుకున్నా లాభం ఉండదు. ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పని మీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దొంగ ఓట్లు ఫలానా ప్రాంతంలో ఉన్నాయనీ, దర్యాప్తు జరిపించి నిజం నిగ్గు తేల్చాలనీ ఎన్నికల ప్రధానాధికారి జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశిస్తే చక్కదిద్దు తారన్న భరోసా లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇసి సక్రమంగా ముందుకు వెళ్లగలదు. గతాను భవాను దృష్టిలో పెట్టుకుని పక్కాగా ఓటరు నమోదు కార్యక్రమం ఉండాలి. అవసరమైతే సాంకేతికతను మరింతగా ఉపయోగించుకోవాలి. ఎన్నికలలో అవకతవకలకు పాల్పడిన అధికారులు ఎంతవారైనా వారి పైన చర్యలు తప్పవన్న హెచ్చరికలు కఠినంగా అమలు కావాలి. అప్పుడే భయం ఏర్పడుతుంది. అందుకు ఎన్నికల సంఘం ముందుకు వస్తుందా అన్నది చూడాలి. ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ కఠిన సంస్కరణలతో ఎన్నికల సంఘం ముందుకు సాగాల్సి ఉంది. ఓటరు నమోదు, తొలగింపు ప్రమసనంగా కాకుండా పక్కాగా జరగాలి. ఈ మేరకు మేధావులు, నిపుణుల సూచనలతో ఆధునిక సాంకతికతతో ముందుకు సాగాలని కోరుకుందాం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు మంచి పేరు ఉన్నప్పటికీ ఎన్నికలలో ధన ప్రభావం విపరీతంగా పెరిగింది. అక్రమాలకు అంతులేకుండా పోతున్నది. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం యథావిధిగా జరుగుతోంది. ఇలాంటి ఆరోపణల నుంచి బయటపడి మనమంతా పక్కాగా ఓటు వేసే విధంగా ఓటరు దినోత్సవాన్ని జరుపుకునేలా కృషి చేస్తారని ఆశిద్దాం.

కరోనా వ్యాక్సిన్‌పై దుష్ప్రచారం

యూపి బరేలిలో కేసు నమోదు

లక్నో,జనవరి19(ఆర్ఎన్ఎ): యూపీలోని బరేలీలోగల ఒక కాలనీలో కొందరు అల్లరిమూకలు కరోనా వ్యాక్సిన్‌పై వదంతులు వ్యాపింపజేస్తూ, ఇందుకు సంబంధించిన పోస్టర్లు అతికిస్తున్న ఉదంతం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఇటువంటి అజ్ఞాత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సర్కిలెస్ అధికారి డాక్టర్ రంజన్ గౌతమ్ మాట్లాడుతూ రాజేంద్ర నగర్ పరిధిలో కరోనా టీకా విషయమై దుష్ప్రచారం సాగిస్తున్నారని గుర్తించామన్నారు. దీనికి సంబంధించిన కొన్ని ఆధారాలు లభించాయన్నారు. ఈ విధమైన ప్రచారాలు సాగిస్తూ, టీకాపై ప్రజల్లో లేనిపోని అపోహలు కలిగిస్తున్నార న్నారు. ఈ నేపథ్యంలో ఈ కరపత్రాల ఆధారంగా కొందరు అజ్ఞాత వ్యక్తులపై ప్రేమ్ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఇదే సమయంలో పట్టణంలో పోలీసు భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. అల్లరిమూకల ఆగడాలకు అడ్డుకట్టవేస్తామని తెలిపారు.

ఆస్తి తగాదాలతో టీచర్ ఆత్మహత్య

వరంగల్ రూరల్,జనవరి19(ఆర్ఎన్ఎ): నర్సంపేట పట్టణం వరమ్మతోట కాలనీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు లింగమూర్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరంగల్ అర్బన్ జిల్లా ఖిలా వరంగల్ మండలం గాడిపెల్లి గ్రామానికి చెందిన లింగమూర్తి(48) ఖానాపూర్ మండలం బుధరావుపేటలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం ఇతని సోదరుడు నవీన్ ఆకస్మిక మరణంతో వీరి కుటుంబంలో ఆస్తి తగాదాలు చోటు చేసుకున్నాయి. తల్లిదండ్రులతో పాటు తల్లి సోదరి వలన తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని మృతుడు సూసైడ్ నోట్ పెట్టి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమజంట ఆత్మహత్య

ప్రియుడు మృతి..ప్రియురాలి పరిస్థితి విషమం

ఆదిలాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): జిల్లాలోని తలమడుగులో విషాదం చోటు చేసుకుంది. తమ ప్రేమను పెద్దలు అంగీకరించలేదని ప్రేమజంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ప్రమాదంలో ప్రియుడు మృతి చెందగా..ప్రియురాలి పరిస్థితి విషమంగా మారడంతో..ప్రియురాలిని దగ్గర్లో ఉన్న రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన తలమడుగు మండలంలోని దేగాంలో జరిగింది. సంఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను వెల్లడించారు. మృతుడు యువకుడు శ్రీరాంగా గుర్తించారు.

ఫ్లెక్సీల విషయంలో టిఆర్ఎస్ నేతల ఘర్షణ

వరంగల్,జనవరి19(ఆర్ఎన్ఎ): జిల్లాలోని రెండు టీఆర్ఎస్ వర్గాలు దాడులు చేసుకున్నాయి. టీఆర్ఎస్ ఫ్లెక్సీల విషయంలో ఘర్షణ నెలకొంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి ఫ్లెక్సీల విషయమే టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ గొడవలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కార్యకర్తలు దాడి చేసుకున్న వీడియోలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

ఎపిలో రాజ్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ ర్యాలీ

అడ్డుకుని నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అమరావతి,జనవరి19(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు ఏపీ కాంగ్రెస్ రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించింది. గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌కు మెమొరాండం సమర్పిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పిలుపు మేరకు అన్ని రాష్ట్రాల్లోనూ రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమం జరిగింది.

ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శైలజానాథ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోడానికి ప్రయత్నించడంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్ ముట్టడికి ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకుని అరెస్టు చేశారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలను ఎత్తేయాల్సిందే

ధాన్యంకొనుగోళ్లు చేపట్టాల్సిందే: ఉత్తమ్

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): రైతులకు గుదిబండగా మారిన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సిందేనని కాంగ్రెస్ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేని, కేవలం కార్పోరేట్లకు మాత్రమే ఉపయోగ పడే చట్టాలను కొనసాగిస్తే ఊరుకునేది లేదన్నారు.

ఇకపోతే

అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతుంటే.. దేశంలో మాత్రం డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతున్నా యన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో చలిలో వణుకుతున్న రైతులపై మోడీ ప్రభుత్వం తీరు..

రైతులకు సంఘీభావంగా రాజ్ భవన్ ఘెరావ్ చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి .. ధాన్యాన్ని కొనుగోలు చేయమని ప్రకటన చేశారని ఇది సమంజసం కాదన్నారు.

50 శాతం జనాభా వ్యవసాయంపైన ఆధారపడి ఉందని..ఏ పంట అయినా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు.

దేశ్లలో 7 వేల కోట్లు ధాన్యం కొనుగోలు చేయడంతో నష్టం అని చెబుతున్న ప్రభుత్వం..ఏడేళ్లలో 10 లక్షల కోట్లు ఖర్చు పెట్టి, 3 లక్షల కోట్లు అప్పులు చేసి, మీరు మీ మిత్రులు వేల కోట్లు దండుకున్నారన్నారు. రైతుల పంటల కొనుగోలు చేయాలన్నప్పుడు మాత్రమే నష్టం గుర్తొస్తుందా.. అని ప్రశ్నించారు. మీరు కొన్న ధాన్యం ఫుడ్ కార్పొరేషన్ ఇండియా కొంటుందని.. రాష్ట్రంలో పండిన ప్రతి గింజ మద్దతు ధరకు కొనాల్సిందే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలను కలుపుకుపోయి పంటలు కొనుగోలు చేసే వరకు పోరాడుతామన్నారు. నాగార్జున సాగర్, వరంగల్ , ఖమ్మం మున్సిపల్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి గట్టి తీర్పు ఇవ్వాలన్నారు.

భారతీయ అమెరికన్లకు పెద్దపీట వేసిన జో బైడెన్ - కమలా హారిస్

ఇటీవల జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాల ఎన్నికల్లో 46వ అధ్యక్షుడిగా విజయం సాధించిన డెమక్రటిక్ అభ్యర్థి జో బైడన్ 20 జనవరి 2021న బాధ్యతలు చేపట్టడానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ప్రథమ భారతీయ అమెరికన్ ఉపాధ్యక్షురాలిగా కమలా హారిస్ ఎన్నికైన విషయం మనందరికీ తెలిసిందే. జో బైడెన్ ప్రభుత్వంలో ఇప్పటికే 20 మంది ఇండియన్ అమెరికన్లకు కీలక బాధ్యతలు అప్పగించడం, అందులో 13 మంది మహిళామణులు ఉండడం మరియు 17 మందికి స్వేతసౌధంలోనే ప్రముఖ స్థానం కల్పించడం భారతీయులకు గర్వకారణంగా నిలుస్తున్నది. భారత సంతతికి చెందిన అమెరికన్ల పూర్వాపరాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

నీరా టాండన్: భారతీయ సంతతికి చెందిన 51 ఏండ్ల నీరా టాండన్‌కు 'శ్వేతసౌధ కార్యాలయ నిర్వహణ మరియు బడ్జెట్' అనబడే కీలక బాధ్యతలు అప్పగించారు. డెమక్రటిక్ పార్టీ చురుకైన కార్యకర్తగా 1988 నుంచి నేటి వరకు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో సేవలు అందించారు. భారతీయ తల్లితండ్రులు అమెరికాలో స్థిరపడిన తరువాత నీనా టాండన్ 5వ ఏట తల్లితండ్రులు విడాకులు తీసుకున్నారు. ఒంటరైన తల్లి మాయ టాండన్ అతి కష్టంతో పిల్లలు నీనా మరియు రాజ్‌లను పెంచి విద్యాబుద్ధులు నేర్పింది. బాచిలర్ డిగ్రీ మరియు న్యాయశాస్త్రంలో పట్టాలు పొందిన నీనా టాండన్ బెంజమిన్ ఎడ్వర్డ్‌ను వివాహమాడారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, బారక్ ఒబామా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించింది.

డా: వివేక్ మూర్తి: 21వ అమెరికన్ సర్జన్ జనరల్‌గా కీలక బాధ్యతలు స్వీకరించనున్న డా: వివేక్ మూర్తి పూర్వీకులు కర్నాటకకు చెందిన వారు. బారక్ ఒబామా పాలనలో కూడా 19వ సర్జన్ జనరల్‌గా పని చేసిన వివేక్ మూర్తి ప్రస్తుతం కోవిడ్-19 సలహా మండలి సహఅధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. డా: వివేక్ తాతగారైన నారాయణ మూర్తి మైసుర్ షుగర్ కంపెనీ డైరెక్టర్‌గా పని చేశారు. 1978లో డా: వివేక్ తల్లితండ్రులు మైత్రేయి మరియు డా: లక్ష్మినరసింహా మూర్తిలు యూయస్‌కు వెళ్లి స్థిరపడ్డారు. మియామిలో పాఠశాల విద్య పూర్తి చేసిన వివేక్ మూర్తి అనంతరం బిఎ, యండి, యంబిఎ పట్టాలు పొందారు.

వినయ్ రెడ్డి: అధ్యక్షుడు బైడెన్ ప్రసంగ రచనల డైరెక్టర్ మరియు రాజకీయ సలహాదారుగా శ్వేతసౌధంలో వినయ్ రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తారు. తల్లితండ్రులు అమెరికాలో స్థిరపడిన కారణంగా వినయ్ రెడ్డి డిగ్రీ మరియు జురిస్ (న్యాయ) డాక్టర్ పట్టాలు పొందారు. ఒబామా అధ్యక్షుడిగా మరియు బైడెన్ ఉపాధ్యక్షుడిగా పని చేసిన సమయంలో కూడా రెడ్డి ప్రసంగ రచన డైరెక్టర్‌గా కూడా సేవలు అందించారు.

వినీత గుప్తా: బైడెన్ ప్రభుత్వంలో వినీత న్యాయ శాఖలో అసోసియేట్ అటార్నీ జనరల్‌గా పని చేయనున్నారు. గతంలో ఒబామా ప్రభుత్వంలో కూడా యూయస్ అసిస్టెంట్ అటార్నీ జనరల్ ఫర్ హూమన్ రైట్స్ పదవిలో పని చేశారు. భారతీయ తల్లితండ్రులు యూయస్‌లో స్థిరపడిన తరువాత వినీత బిఎ మరియు న్యాయ జెడి పట్టాలు పొందింది.

ఉజ్రా జేయా: అమెరికా విదేశాంగ శాఖలో పౌర భద్రత, ప్రజాస్వామ్యం మరియు పౌర హక్కుల అండర్ సెక్రటరీగా ఉజ్రా జేయా పని చేయనున్నారు. గత మూడు దశాబ్దాలుగా రాయబారిగా మరియు ప్రభుత్వంలో పలు పదవులు అలంకరించిన అనుభవం అపారంగా ఉన్న ఉజ్రా జేయా శాంతి పునరుద్ధరణలో ప్రధాన భూమిక నిర్వహించారు. అమెరికా రాయబారిగా ఇండియా, మస్కట్, దమస్కస్, కైరో మరియు కింగ్స్‌టన్‌లలో పని చేసిన అనుభవం చాలా ఉన్న ఉజ్రాకు అంతర్జాతీయ స్థాయి అవగాహన అధికంగా ఉంది.

మాలా అడిగా: బైడెన్ సతీమణి, అమెరికా ప్రథమ మహిళ డా: జిల్ బైడెన్‌కు పాలసీ డైరెక్టర్‌గా మాలా అడిగా నియమించబడ్డారు. ఎన్నికల ప్రచారంలో జిల్ బైడెన్‌కు సలహాదారుగా, ఒబామా పాలనలో డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీగా పని చేశారు. మహిళా సమస్యలు, మానవ హక్కులు, న్యాయశాఖలలో పని చేసిన అనుభవమున్న మాలా అడిగా కర్నాటకలోని ఉడిపి జిల్లాకు చెందినది. 25 ఏళ్ల క్రితం తండ్రి డా: రమేష్ అడిగా తల్లి డా: జయ అడిగా వైద్యులుగా అమెరికాలో స్థిరపడ్డారు. మాలా అడిగా బిఎ, పిజీ మరియు న్యాయ పట్టాలు పొందింది.

గరిమా వర్మ: అమెరికా ప్రథమ మహిళ డా: జిల్ బైడన్‌కు డిజిటల్ డైరెక్టర్‌గా నియమించబడ్డారు. ఇండియాలో పుట్టిన గరిమా అమెరికాలో స్థిరపడి బైడెన్ - హారిస్ గెలుపు కోసం ప్రచార విషయాలు పర్యవేక్షించారు. వినోదరంగంలోని పారమౌంట్ పిక్చర్స్, వాల్ట్ డిస్నీ కంపెనీ, హ్పరిజాన్ మీడియాకి సేవలందించారు.

సబ్రీనా సింగ్: అమెరికా వైట్ హౌజ్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా నియమించబడిన భారత సంతతికి చెందిన సబీనా సింగ్ ఎన్నికల ప్రచారంలో కమలా హారిస్ ప్రెస్ సెక్రటరీగా పని చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా సేవలు అందించారు.

అయేషా షా: కశ్మీర్‌కు చెందిన అయేషా షా శ్వేతసౌధంలో పార్టనర్‌షిప్ మేనేజర్‌గా డిజిటల్ వ్యూహం కార్యాలయంలో పని చేశారు. ఒబామా ప్రభుత్వంలో సీనియర్ పాలసీ అడ్వైజర్‌గా నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ మరియు ట్రెజరీ డిపార్టుమెంటుగా పని చేశారు. న్యాయ పట్టా పొందిన అయేషా న్యాయ కళాశాలలో ఉపన్యాసకురాలిగా కూడా పని చేశారు.

సమీరా ఫైజిలి: కశ్మీర్‌కు చెందిన భారతీయ అమెరికన్ సమీరా ఫైజిలి వైట్ హౌజ్‌లోని జాతీయ ఆర్థిక మండలిలో డిప్యూటీ డైరెక్టర్ విధులు నిర్వహించనున్నారు. దేశ ఆర్థిక విధానాలను అధ్యక్షుడికి సలహాలు అందించే బాధ్యత ఈ మండలి తీసుకుంటుంది. 1970-71లో సమీరా తండ్రి వైద్యుడిగా అమెరికా వెళ్ళి స్థిరపడినారు. తల్లితండ్రులు ఆశించినట్లు వైద్యురాలిగా స్థిరపడాల్సిన సమీరా ప్రజాసేవకు ఉత్సాహం చూపుతూం అట్లాంటా ఫెడరల్ బ్యాంక్‌లో డైరెక్టర్‌గా పని చేశారు.

భరత్ రమణమూర్తి: ప్రస్తుతం రూజ్‌వెల్ట్ ఇనిస్టిట్యూట్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేసిన భరత్ రమణమూర్తిని బైడెన్ ప్రభుత్వం జాతీయ ఆర్థిక మండలి డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు. మేధావిగా పేరుగాంచిన తమిళనాడుకు చెందిన భరత్ కరోనా సహాయ చర్యల్లో కూడా చేయూతను ఇచ్చారు. తండ్రి రవి రమణమూర్తి హార్వర్డ్‌లో డాక్టరేట్ చేయటానికి అమెరికా వచ్చారు. తండ్రి బాటలో భరత్ మరియు అతని ఇద్దరు పిల్లలు కూడా హార్వర్డ్‌లో డాక్టరేట్లు పూర్తి చేశారు.

గౌతమ్ రాఘవన్: వైట్‌హౌజ్‌లో బైడెన్ వ్యక్తిగత సిబ్బంది వ్యవహారాల డైరెక్టర్‌గా గౌతమ్ రాఘవన్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఒబామా ప్రభుత్వంలో కూడా ప్రజా సంబంధాల శాఖ అసోసియేట్ డైరెక్టర్‌గా (2011-17) పని చేశారు. ఇండియాలో జన్మించిన గౌతమ్ అమెరికాలో డిగ్రీ మరియు పిజీ పూర్తి చేశారు.

వేదాంత్ పటేల్: శ్వేత సౌధపు అసిస్టెంట్ ప్రెస్ డైరెక్టర్‌గా భారతీయ సంతతికి చెందిన వేదాంత్ పటేల్ పని చేయనున్నారు. ప్రస్తుతం బైడెన్‌కు సీనియర్ స్పోక్స్‌పర్సన్‌గా పని చేస్తున్నారు కాంగ్రెస్ సభ్యులు పరిమళ జయపాల్ మరియు మైక్ హోండాలకు కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా సేవలు అందించారు. ఇండియాలో పుట్టిన పటేల్ అమెరికాలో డిగ్రీ పూర్తి చేశారు.

తరుణ్ ఛాబ్రా: బైడెన్ ప్రభుత్వంలో జాతీయ భద్రత మండలిలో సాంకేతిక, జాతీయ భద్రత సీనియర్ డైరెక్టర్‌గా నియమించబడిన తరుణ్ ఛాబ్రా విశ్వవిద్యాలయాలలో పలు బాధ్యతలు నిర్వహించారు. ఒబామా ప్రభుత్వంలో కూడా జాతీయ భద్రతా మండలిలో సేవలను మరియు డిఫెన్స్ సెక్రటరీ ప్రసంగ రచయితగా కూడా పని చేశారు. ఇండియా సంతతికి చెందిన మె?దటితరం వ్యక్తిగా అమెరికాలో డిగ్రీ మరియు న్యాయ పట్టాలు పొందారు.

సుమోనా గుహ: బైడెన్ ప్రభుత్వంలో దక్షిణాసియా వ్యవహారాల సీనియర్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న భారతీయ సంతతికి చెందిన సుమోనా గుహ ఎన్నికల ప్రచారంలో కూడా సేవలు అందించారు. ప్రతిభావంతురాలైన సుమోనా గతంలో విదేశీ సేవలు, యూయస్-ఇండియా వ్యాపార మండలి, దక్షిణాసియా పాలసీ, పాకిస్థాన్ మరియు అఫ్ఘానిస్థాన్ విదేశీ వ్యవహారాలు మరియు బైడెన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నపుడు పలు సేవలను అందించిన ధీర వనితగా పేరు తెచ్చుకున్నారు.

శాంతి కళాథిల్: జాతీయ భద్రతా మండలిలో ప్రజాస్వామ్యం, మానవ హక్కుల వ్యవహారాల సమన్వయకర్తగా శాంతి కళాథిల్ సేవలు అందించనున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ ప్రజాస్వామ్య మండలి సీనియర్ డైరెక్టర్‌గా సేవలు అందించనున్న శాంతి డిగ్రీ మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో పట్టాలు పొందారు. ప్రఖ్యాత రచయితగా కూడా కళాథిల్‌కు గుర్తింపు ఉంది.

విదుర్ శర్మ: బైడెన్ ప్రభుత్వంలో కోవిడ్-19 స్పందన బృందంలో సలహాదారుగా విదుర్ శర్మ విధులు నిర్వహించనున్నారు. ఒబామా ప్రభుత్వంలో ఆరోగ్య పాలసీ కౌన్సిల్‌లో పని చేశారు. డిప్యూటీ రీసర్చ్ డైరెక్టర్‌గా కూడా సేవలు అందించిన విదుర్ డిగ్రీ పట్టా పొందారు.

నేహ గుప్త: వైట్‌హౌజ్‌లో అసోసియేట్ కౌన్సిల్‌లో పని చేయనున్న నేహ గుప్త గతంలో డిప్యూటీ అటార్నీగా పని చేశారు. హార్వర్డ్‌లో డిగ్రీ మరియు స్టాన్‌ఫర్డ్‌లో న్యాయ పట్టా పొందిన వనిత నేహ.

రీమా షా: భారతీయ సంతతికి చెందిన రీమా షా శ్వేత సౌధం కౌన్సిల్ డిప్యూటీ అసోసియేట్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. న్యాయ పట్టా పొందిన రీమా గతంలో పలు కోర్టులలో బాధ్యతలు చేపట్టారు.

సోనియా అగర్వాల్: వైట్‌హౌజ్‌లో వాతావరణ విధాన విభాగంలో సీనియర్ సలహాదారుగా బాధ్యతలు తీసుకోనున్నారు. బైడెన్ ఉపాధ్యక్షుడిగా ఉన్నపుడు 200 మంది పవర్ ఎక్స్‌పర్ట్స్ సమావేశం ఏర్పరిచిన ఘనత సోనియాది. సివిల్ ఇంజనీరింగ్‌లో పిజీ చేసిన భారత సంతతికి చెందిన సోనియా అమెరికా పవర్ ప్లాన్‌లో ప్రముఖ భూమిక నిర్వహించారు.

జో బైడెన్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న కొన్ని గంటల ముందే తన ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలను భారతీయ అమెరికన్లకు అప్పగించడం, మరి కొంత మందికి పలు అధికారాలు రావచ్చని అంచనా వేస్తున్న తరుణంలో రాబోయే రోజుల్లో ఇండియా అమెరికాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని, ఇరుదేశాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో నడుస్తారని ఆశిద్దాం. అమెరికాలో స్థిరపడిన భారత సంతతి ప్రజలు ఎదుగుతూ, తల్లి భారతి సమగ్రాభివృద్ధికి సహకరించాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రామభక్తుల ర్యాలీలో చంటి క్రాంతికిరణ్

విరాళాల సేకరణలో పాల్గొన్న ఆందోల్ ఎమ్మెల్యే

సంగారెడ్డి,జనవరి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో టీఆర్ఎస్ , బీజేపీ నాయకులు ఒకరిపై మరొకరు కారాలు మిరియాలు నూరుకుంటుంటే మరోవైపు ఇదంతా తనకేమీ పట్టనట్టుగా టీఆర్ఎస్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మంగళవారం ఆందోల్ - జోగిపేటలో రామ భక్తుల భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అయోధ

దుర్గగుడి పాత టిక్కెట్ల అమ్మకం

-నిందితుల్లో ఒకరిని పట్టుకున్న పోలీసులు

విజయవాడ,జనవరి19(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గగుడిలో దర్శనానికి సంబంధించిన పాత టికెట్లను విక్రయిస్తున్న ముఠా సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న పాత టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన అభిలాష్, మరికొందరు యువకులు ముఠాగా ఏర్పడి పాత టికెట్లను భక్తులకు విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. ముఠాలో ముగ్గురు పారిపోయారు. అభిలాష్ దొరికాడు. అతని వద్ద ఉన్న పాత టికెట్లన స్వాధీనం చేసుకుని అతన్ని దేవస్థానం ఔట్‌పోస్టు పోలీసులకు అప్పగించగా వారు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే, దేవస్థానం అధికారులు అతనిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని సిఐ చెప్పారు.

గుడివాడ ఎస్ఐ పిల్లి విజయ్‌కుమార్ ఆత్మహత్య

-వివాహేతర సంబంధమే కారణమంటున్న పోలీసులు

ఏలూరు,జనవరి19(ఆర్ఎన్ఎ): కృష్ణా జిల్లా గుడివాడ టూటౌన్ ఎస్ఐ పిల్లి విజయ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన అపార్ట్‌మెంట్‌లో విజయ్ కుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విజయ్ కుమార్ మృతికి వివాహేతర సంబంధమే కారణమంటూ సహచర సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరుకు చెందిన విజయ్ కుమార్.. 2012 బ్యాచ్ ఎస్ఐగా హనుమాన్ జంక్షన్‌లో తొలి బాధ్యతలు చేపట్టాడు. నూజివీడుకు చెందిన బ్యూటీషియన్‌తో వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణలతో విజయ్ కుమార్ అప్పట్లో సస్పెండ్ అయ్యాడు. సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత తిరిగి విధుల్లో చేరిన విజయ్ కుమార్ గుడివాడ సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ఏలూరుకు చెందిన మహిళతో మూడు నెలల క్రితం విజరు కుమార్‌కు వివాహం కాగా, భార్యను కాపురానికి తీసుకురాకుండా బ్యూటీషియన్‌తో కలిసి ఆయన ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. బ్యూటీషియన్ ఒత్తిడి వల్లే విజరు కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విజరు కుమార్ భౌతికకాయాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విజయ్ కుమార్ మరణవార్త తెలుసుకున్న సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది, ఏరియా ఆసుపత్రికి చేరుకుని విచారం వ్యక్తం చేశారు.

తెలంగాణలో మలి ఉద్యమం రావాలి

రాజకీయాల నుంచి కెసిఆర్ తప్పుకన్నట్లు ఉంది

మహిళా మోర్చా సమావేశంలో రాములమ్మ

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో బీజేపీ అధికారంలోకొస్తే రాష్ట్రం రూపురేఖలు మారుతాయని బీజేపీ మహిళా నాయకురాలు విజయశాంతి అన్నారు. తెలంగాణలో మలి ఉద్యమం రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ ప్రజలు అమాయకులు.. వారిని ఎడ్యుకేట్ చేసే బాధ్యత మనపై ఉందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశంలో రాములమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిపై విజయశాంతి ఫైర్ అయ్యారు. దుబ్బాక ఉపఎన్నికలో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మహిళలు కీలక పాత్ర పోషించారు. మూడేళ్ళ పాటు ఓపిక చేసుకుని కష్టపడితే బీజేపీని అధికారంలోకి తీసుకురావచ్చు. సమాజంలో ఎన్నో కష్టసుఖాలను మోసేది మహిళ. ఇంటిని తీర్చిదిద్దేది మహిళ.. ఆడది ఆదిపరాశక్తి.. ఎప్పుడు ఏపాత్ర పోషించాలో తెలుసని అన్నారు. మహిళలను ప్రోత్సహిస్తే వెనకపడిపోతామని కొంతమంది పురుషులు అనుకుంటారు. మహిళలను ఎదుర్కునే శక్తి లేకనే సోషల్ మీడియాలో మహిళలను కించపర్చేలా పోస్టులు పెడతారని రాములమ్మ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ తప్పుకున్నాడని తాను అనుకుంటున్నట్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహిళలపై అత్యాచారాలను నియంత్రిచడంలో సీఎంగా కేసీఆర్ విఫలమయ్యారని విమర్శలు గుప్పించారు. ఎన్‌కౌంటర్ చేయటమే సమస్యకు పరిష్కారం కాదని హితవు పలికారు. మహిళల భద్రత కోసం చట్టాలను సరిగ్గా అమలు చేయటంలో కేసీఆర్‌కు చేతకావటంలేదు. ముఖ్యమంత్రి కంటే ఎక్కువ బూతులు మాట్లాడుతున్నారు. బీజేపీని చించేయమని

టీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. వ్యాక్సినేషన్ సమయంలో ప్రజలకు ధైర్యం ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఫాంహౌస్ బయటకు రాలేదు. బహుశా కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకున్నా దనుకుంటున్నాను. టీఆర్ఎస్‌లో ముఖ్యమంత్రి నుంచి కింది స్థాయి నేతవరకు బూతులే మాట్లాడుతున్నారు. టీఆర్ఎస్ పాలనలో విచ్చల విడిగా దోపిడీలు, కబ్జాలతో రాష్ట్రం నాశనం అయ్యింది. టీఆర్ఎస్ దోపిడీ దొంగలను ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం' అని విజయశాంతి చెప్పుకొచ్చారు.

రాజకీయాలను మలుపు తిప్పిన దుబ్బాక

సిద్దిపేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న రఘునందన్ రావు

సిద్దిపేట,జనవరి19(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను దుబ్బాక ఉప ఎన్నిక మలుపు తిప్పిందని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు వార్డులలో జెండా ఆవిష్కరించి, పార్టీ కార్యాలయాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కరోనా వ్యాక్సిన్ పంపిణీ మొదలు పెట్టి భారత్ విశ్వ గురువుగా నిలిచిందని కొనియాడారు. కరోనా వచ్చి మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పించిందన్నారు. రెండేళ్ల తర్వాత రాజ్యం మారబోతోందన్నారు. సిద్దిపేట పట్టణం ఊరి బయట పచ్చగా.. ఊరి లోపల గుంతల మయంగా ఉందని విమర్శించారు. 1964లో భారతీయ జనసంఘ్ ఇక్కడి నుండే ప్రారంభమైందని, సీఎం కేసీఆర్ నిర్ణయాల పట్ల ప్రజలలో వ్యతిరేకత ప్రారంభమైందని రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు.

మార్షల్ ఆర్ట్స్ గిన్నిస్ రికార్డ్ సాధించిన సాయి దీపక్‌ను సన్మానించిన వృద్ధి రాజ్, కొండ దేవయ్య



కరీంనగర్, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ జిల్లాలో పుట్టి కృష్ణ నగర్ లో నివాసం స్థిరపడిన సాయి దీపక్ పటేల్ మార్షల్ ఆర్ట్స్ లో అంతర్జాతీయంగా అనేక పోటీలో విజేతగా నిలిచాడు.సాయి దీపక్ పటేల్ మార్షల్ ఆర్ట్స్ లో ప్రతిష్ఠాత్మకమైన 4 గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ను సాధించాడు.మార్షల్ ఆర్ట్స్ లో రీసెంట్ గా పాకిస్తాన్ ఇర్ఫాన్ మసూద్ రికార్డును బ్రేక్ చేశాడు.ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ,గవర్నర్ తమిళ సై , హిమాచల్ గవర్నర్ బండారు దత్తాత్రేయ లాంటి ఎందరో ప్రముఖులతో ప్రశంసలు పొందిన సాయి దీపక్ పటేల్ పుట్టినరోజు సందర్భంగా గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు రవిచంద్ర సాయి దీపక్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ,వాయిస్ టుడే కొత్త లక్ష్మణ్ పటేల్,ఆకుల రజిత్ పాల్గొన్నారు.

హైకోర్టులో ఎపి ప్రభుత్వానికి షాక్

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సిఐడి కేసులు కొట్టివేత

అమరావతి,జనవరి19(ఆర్ఎన్ఎ): హైకోర్టులో ఏపీ ప్రభుత్వానికి షాక్ తగిలింది. ఏపీ రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ.. సీఐడీ పెట్టిన కేసులను హైకోర్టు కొట్టివేసింది. కిలారు రాజేష్‌తో పాటు మరికొంత మంది..రాజధానిలో భూములు ముందుగానే కొనుగోలు చేశారని సీఐడీ కేసులు నమోదు చేసింది. రాజధానిలో ఉన్న ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదు చేసింది. భూములు అమ్మినవారు ఎవరూ ఫిర్యాదు చేయలేదని..ప్రభుత్వం కక్షసాధిస్తోందని పేర్కొంటూ కిలారు రాజేష్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

విద్యాసంస్థల పునఃప్రారంభంపై భిన్నాభిప్రాయాలు

కరోనా నియంత్రణ చర్యలు పక్కగా చేపట్టాలి

మరికొంత కాలం వేచి చూస్తే మంచిదని కొందరు

ఫీజుల ఒత్తడిపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలంటున్న పేరెంట్స్

వరంగల్,జనవరి19(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి1 నుంచి తొమ్మిదో తరగతి నుంచి ఆపై పది, ఇంటర్మీడియట్, డిగ్రీతోపాటు వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన కళాశాలలన్నిటిని పునః ప్రారంభించి, తరగతులను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ క్రమంలో కరోనా నియంత్రణకు, శానిటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో శానిటైజేషన్ చేయాలని కోరుతున్నారు. అయితే కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభం అయిన నేపథ్యంలో ఫలితాలు బేరీజు వేసుకుని నమ్మకం ఏర్పడ్డ తరవాతనే ముందుకు సాగడం మంచిదని మరికొందరి వాదనగా ఉంది. అయితే కేవలం 9నుంచే కాకుండా కనసీం 6వ తరగతి నుంచి పకడ్బందీ చర్యలతో ప్రారంభిస్తే మచిదని మరికొందరు అంటున్నారు.

ఇదే క్రమంలో ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. ఫీజుల పేరుతో ఇప్పటికే పీడిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మంత్రులు, కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకొని ఫిబ్రవరి 1 నుంచి విద్యా సంస్థలను తెరవాలని ఆదేశించారు. హాస్టళ్లను కూడా తెరువాలని ఆదేశించడంతో పాఠశాలలు, హాస్టళ్లను శుభ్రం చేసే పనులు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 27 నుంచి ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి ఆన్‌లైన్‌లో బోధిస్తున్నారు. వారంలో మూడు రోజులు విధులకు హాజరవుతున్నారు. సెప్టెంబరు 11 నుంచి ఆన్‌లైన్ విద్యాబోధన ప్రారంభమైంది. మొదట్లో సవ్యంగానే జరిగినా ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య, టీవీలు, విద్యుత్ సరఫరా లేక పోవడం వంటి సాంకేతిక కారణాలతో అంతంత మాత్రంగానే ఆన్‌లైన్ విద్యాబోధన జరిగింది. ఇక ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఫిబ్రవరి 1 నుంచి పాఠశాలలు, కళాశాలలకు పూర్వవైభవం రానున్నది. కరోనా మహమ్మారి కనీవినీ ఎరుగని రీతిలో ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. దీంతో గత ఏడాది మార్చి 21 నుంచి దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు మూతపడ్డాయి. 2019-20 విద్యాసంవత్సరంలో వార్షిక పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులందరిని ఉత్తీర్ణులు చేసి ఉన్నత చదవులకు ప్రభుత్వం అవ్‌గ్రేడ్ చేసింది. విద్యార్థులు, ఉపాధ్యాయులంతా ఇళ్లకే పరిమితమయ్యారు. మద్యాహ్న భోజన పథకం అటకెక్కింది. ఈ నేపథ్యంలో 2020-21 విద్యాసంవత్సరం లోనైనా పరీక్షలు నిర్వహించి విద్యా వ్యవస్థను గాడినపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విద్యాబోధనకు శ్రీకారం చుట్టినప్పటికి అంతంత మాత్రంగానే సాగింది. కరోనా ఇప్పట్లో పోయేటట్లు లేదని, పాఠశాలలు, కళాశాలలు తెరిచే పరిస్థితి లేదని, గత విద్యాసంవత్సరం మాదిరిగానే ప్రస్తుత సంవత్సరంలో కూడా వార్షిక పరీక్షలు నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదని ప్రచారం జరిగింది. సంక్రాంతి పండగ తర్వాత ఈ నెల 18 నుంచి స్కూల్స్, కాలేజీలను తెరుస్తారని, ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే మరో ప్రచారం జరిగింది. అయితే కరోనా వైరస్ కొత్త రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ విద్యాబోధన చేయాలని, పరీక్షలు లేకుండానే అవ్ గ్రేడ్ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని మెజార్టీ విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఉపాధ్యాయులు మాత్రం పాఠశాలలు, కళాశాలలు తెరిస్తేనే బాగుంటుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1నుంచి విద్యాసంస్థలకు విద్యార్థులు తప్పనిసరిగా రావాలని, రాలేని వారు ఆన్‌లైన్ విద్యాబోధన ద్వారా చదువు కోవాలని సూచిస్తున్నారు. 10 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు ఫిబ్రవరి 1నుంచి తెరుచుకోనున్నాయి. జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్, ఐటీఐ వంటి టెక్నికల్ కళాశాలల్లో వేలాదిమంది వివిధ కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వం

పాఠశాలు, కళాశాలలను ఫిబ్రవరి 1 నుంచి పునఃప్రారంభించాలని నిర్ణయం తీసుకొని ఆదేశాలు జారీ చేయడంపై ట్రస్మా, ఇతర సంస్థలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. హాస్టల్ నిర్వాహకులు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. జూనియర్ కాలేజీల పునఃప్రారంభం అనంతరం షిఫ్టుల వారీగా తరగతులు నిర్వహించాలన్న నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించుకోబోతున్నట్లు తెలిసింది. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు వేర్వేరుగా రెండు షిఫ్టుల్లో తరగతులు నిర్వహించాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. దీనికి బదులుగా ఒకరోజు ఫస్టియర్, మరోరోజు సెకండియర్ వారికి తరగతులు నిర్వహించాలని యోచిస్తున్నట్లు సమాచారం. షిఫ్ట్ సిస్టమ్‌పై ఇప్పటికే మార్గదర్శకాలు జారీచేసిన అధికారులు విద్యార్థుల సౌకర్యార్థం నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలిసింది.

కాంట్రాక్ట్ లెక్చరర్లపై కక్ష

ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డా కానరాని పరిష్కారం

బదిలీల ప్రక్రియకు కూడా నోచుకోని వైనం

అరకొర జీతాలతో నానాయాతన

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ బదిలీ పక్రియకు ఆదేశించి రెండు నెలలు అవుతున్నా అమలుకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బదిలీల పక్రియ అమలు కాకపోవడంతో దూరభారంతో సైతం విధులకు హాజరు అవుతున్న మహిళా లెక్చరర్ల బాధలు వర్ణనాతీతం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు అనే పదమే ఉండదని సిఎం కెసిఆర్ చెప్పిన మాటలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రత్యేక రాష్ట్రసాధనలో సైతం ముందుండి పోరాడిన కాంట్రాక్టు లెక్చరర్లకు చేదు అనుభవాలే మిగిలిపోయాయి. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు మారుతాయని అనుకుంటే యధావిధిగా వారు యాతన పడుతూనే ఉన్నారు. ప్రభుత్వ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు సర్వీసుల క్రమబద్ధీకరణ అమలు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వీసుల క్రమబద్ధీకరణ అమలు కాకపోవడంతో ఉద్యోగానికి రక్షణ లేకుండా పోయిందని మానసిక క్షోభతో సతమతం అవుతున్నారు. అన్ని అర్హతలు ఉండి కూడా క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారు ఆవేదన చెందుతున్నారు. సమస్యల సాధన కోసం ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం మాత్రం శూన్యం. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెర వేర్చకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కష్టపడి విధులు నిర్వహిస్తున్న నెలల తరబడి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పరిస్థితులు. ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి 2000 సంవత్సరంలో స్థానిక త్రిమాన్ కమిటీల ఆధారంగా స్థానికులకు అవకాశం ఇస్తూ కాంట్రాక్టు లెక్చరర్లను నియమించడం జరిగింది. అనంతరం 2007 సంవత్సరంలో ఆర్‌జేడీ ఆదేశానుసారం గా జోనల్ వ్యవస్థను అమలు చేస్తూ లెక్చరర్ల నియామకం జరిపారు. అయితే గత 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 4500 గౌరవవేతనంతో ప్రారంభమై అనేక కష్టనష్టాలకు ఓరుస్తూ సమస్యల సాధన కోసం ఉద్యమించారు. ఉద్యోగభద్రత కల్పించాలని, గౌరవవేతనాలు పెంచాలని బదిలీల పక్రియను అమలు చేయాలని సమ్మె చేసిన సందర్భాలు సైతం చాలా ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం తమ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీలు హామీలుగానే మిగిలిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో కష్టపడి ప్రభుత్వ లెక్చర ర్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా నెలనెలా వేతనాలు అందక ఇబ్బందులు పడవలసి వస్తుంది. రోజులతరబడి వేతనాలతో నిరీక్షించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని కాంట్రాక్టు లెక్చరర్లు పేర్కొంటున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల విధుల నిర్వహణ జోనల్‌పద్ధతిలో కొనసాగుతుంది. జోనల్ పద్ధతిలో ఆయా జిల్లాల్లో ఎక్కడైనా విధులను నిర్వర్తించడానికి అవకాశం ఉంటుంది. దూరభారమైనప్పటికీ మహిళా లెక్చరర్లు సైతం ఇతర జిల్లాలో పనిచేయడం జరుగుతుంది. ఇందుకోసం ఈ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి బదిలీల పక్రియను అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశించి రెండు నెలలు అవుతున్నా బదిలీలకు ఇంకా శ్రీకారం చుట్టలేదు. బదిలీలు ప్రారంభమైతే ఏ జిల్లా వారు వారి జిల్లా వెళ్లడంతో ఆర్థికభారం తగ్గడంతో పాటు కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండటం జరుగుతుంది. కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించిన జీవోనెంబరు 16 అమలు కాకపోవడంతో వీరి సమస్యలు మొదటికి వచ్చిందని చెప్పవచ్చు. గతంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసి జీవోనెంబరు 16 జారీ చేసిన కోర్టు కేసుతో ఈ క్రమబద్ధీకరణకు ఆదిలోనే బ్రేక్ పడింది.

కరోనాసమయంలో కూడా కాంట్రాక్టు లెక్చరర్ల ఇబ్బందులు తప్పలేదు. కేవలం గౌరవవేతనాలపై ఆధారపడి ఉన్న వారికి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారింది. లాక్‌డౌన్ సమయంలో వేతనాలు లేక కూలీ పనులకు సైతం వెళ్లి జీవనం కొనసాగించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టించుకొని తమ సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కాంట్రాక్టు లెక్చరర్లు వేడుకుంటున్నారు.

శాఖకు తరలిపోతున్న రాజధాని

మూడు రాజధానుల నిర్ణయంలో కానరాని మార్పు

అమరావతి ఆందోళనలు బేఖాతరు

అందుకే ఓదార్పునకు దూరంగా జగన్

అమరావతి,జనవరి19(ఆర్ఎన్ఎ): అమరావతి కోసం ఆందోళనలు చేస్తున్న వారు ఏడాదిగా రోడ్డెక్కినా వారిని ఓదార్చేందుకు సిఎం జగన్‌కు మాత్రం సమయం చిక్కడం లేదు. విశ్శాఖకు రాజధానిని తరలించే ప్రక్రియ వేగవంతం అయ్యింది. ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టారు. అందుకే ఆందోళన చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. అదో పెయిడ్ ఆర్టిస్టుల కార్యక్రమమని నిర్ధారణకు వచ్చిన జగన్ మూడు రాజధానుల ముచ్చటలో మునిగి పోయారు. కోర్టుల్లో కేసులు లేకుంటే ఈ పాటికి ఆ ముచ్చటా ముగిసేది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బాగా ఇష్టమైన ఓదార్పు ఇప్పుడు కనిపించడం లేదు. తన రాజకీయ ప్రస్థానంలో ఆయన ఓదార్పు యాత్రలతో ప్రజల వద్దకు వెళ్లేవారు. అమరావతి విషయంలో మాత్రం ఆయన అస్సలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజలు ఆందోళన చేస్తున్నా వారిని పలకరించి ఓదార్చడం లేదు. రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులతో పాటు ఇతర వర్గాల ప్రజలు ఆందోళన బాట పట్టినా జగన్మోహన్ రెడ్డి చలించడం లేదు. వారిని కలసి ఓదార్చడం లేదు.

రైతులకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా ఆయన ముందుకు రావడం లేదు. రైతులకు ఏమి కావాలో కనుక్కుని సమస్య పరిష్కరించండని తమను ఆదేశించినట్లుగా మంత్రులు బయటికి చెబుతున్నారు. లోపల జగన్ వారితో ఏమన్నారో తెలియడం లేదు. రాజధాని విషయమై ప్రజలలో గందరగోళం నెలకొన్నప్పటికీ ఈ విషయంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి తాను ఏమి అనుకుంటున్నది బహిరంగంగా చెప్పడం లేదు. అలాగే తాను అనుకున్న విషయాన్ని వారిని నేరుగా కలసి మాట్లాడడం లేదు. వారంతా చంద్రబాబు పెయిడ్ ఆర్టిస్టులుగా గుర్తించడం వల్లనే ఈ సమస్య వచ్చింది. అందుకే అమరావతి విషయంలో జగన్ ధోరణి ఇందుకు విరుద్ధంగా ఉంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ప్రతిరోజూ తన క్యాంప్ కార్యాలయంలో ప్రజలను కలిసి విజ్ఞప్తులు స్వీకరించేవారు. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఇందుకు పూర్తి భిన్నంగా పాలనా వ్యవహార శైలి ఉంటోంది. తనకు నచ్చిన లేదా అవసరమైన అతి కొద్దిమంది వ్యక్తులను మినహా ఎవరినీ ఆయన కలవడం లేదని తెలుస్తోంది.దీంతో సిఎం అయ్యాక జగన్ వైఖరి చాలా మందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. రాజధానిపై ఇంత గందరగోళం ఎందుకు? కనీసం జగన్ నేరుగా చెప్పవచ్చు కదా అని ఆందోళన చేస్తున్న రైతులు కోరుకుంటున్నారు. తమ ఆవేదనను ఎవరికి చెప్పు కోవాలో తెలియక వారు మధనపడు తున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని రైతులను జగన్మోహన్ రెడ్డి కలుసుకోవా లనుకోవడం అత్యాశే అవుతుంది. అమరావతి భూములు నిర్మాణాలకు అనువైనవి కాదని మద్రాస్ ఐఐటీ నివేదిక ఇచ్చిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కూడా అభాసుపాలయ్యింది. అలాంటి నివేదిక తాము ఇవ్వలేదని ఆ సంస్థ ఖండించిన విషయం కాస్తా ప్రభుత్వ పరువు తీసినట్లు అయ్యింది. దీన్నిబట్టి రాజధానిని తరలించాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం ఆ క్రమంలో అమరావతిపై అవాస్తవాలు ప్రచారం చేసినట్టు స్పష్టమవుతోంది. రాజధాని ప్రాంతాన్ని ముంపుప్రాంతంగా పరిగణించలేమని జాతీయ హరిత ట్రైబ్యునల్ స్పష్టంగా తీర్పు ఇచ్చింది. అయితే అమరావతిలో బాబు బృందం భూముఉల సేకరించిందన్న ఏకైక కారణంతో, ముందుగానే తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పుడు ప్రాతిపదికను అమరావతిని తరలించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు. జరుగుతున్న వ్యవహారమంతా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుపై కోపంతో అన్నది స్పష్టంగా తెలుసుకోవచ్చు. మొత్తంగా ఏపీలో రాజధాని మార్పుపై ఆందోళనలు జరుగుతున్నాయి. రాజధానిని మార్చడాన్ని జసిఎం జగన్ చాలా సులువైన విషయంగా పరిగణిస్తున్నారు. ఇప్పటికే అమరావతిని రాజధానిగా గుర్తించి నిర్మాణాలు, రహదారులు వంటి రాజధానుల ప్రతిపాదనతో ముందుకు వెళ్లడమే లక్ష్యంగా జగన్ నిర్ణయాలు ఉన్నాయి. అందుకే ఆయన అమరావతి రైతులను ఓదార్చేందుకు ముందుకు రావడం లేదు. ఇకపోతే విశాఖకు రాజధాని తరలిపోవడం ఖాయమని ఇటీవలే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డ ఇస్పష్టం చేశారు. దీంతో ఇక అమరావతి కతను ముగించే పనిలో చాపకింద నీరులా పనిచేస్తున్నారని భావించాల్సిందే.

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 46.580 కిలోల గంజాయి దగ్ధం

కరీంనగర్, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి): కమిషనరేట్‌వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని మంగళవారం నాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్, జిల్లా మాదకపదార్థాల నియంత్రణ కమిటి ఛైర్మెన్ విబి కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషనరేట్ కేంద్రంలో దగ్ధం చేశారు.

కమిషనరేట్‌లోని కరీంనగర్ వన్‌టౌన్, త్రీటౌన్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, జమ్మికుంట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్టుకున్న 10కేసుల్లో 46.580కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని దగ్ధం చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్,జిల్లా మాదకపదార్థాల నియంత్రణ కమిటి ఛైర్మెన్ విబి కమలాసన్‌రెడ్డితోపాటుగా అడిషనల్ డీసిపి(పరిపాలన)జి చంద్రమోహన్, కరీంనగర్ టౌన్ ఏసిపి పి అశోక్

సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదు : మంత్రి జగదీశ్ రెడ్డి

నల్లగొండ, జనవరి 19: బీజేపీ, కాంగ్రెస్ నేతలు కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోరని, కేసీఆర్‌పై అవాకులు చవాకులు పేలితే ఖబడ్దార్ అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాగార్జున సాగర్ నియోజకవర్గంలో సాగర్, హాలియాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్ల రాజేశ్వర్ రెడ్డి, తేరా చిన్నపరెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ వల్లే తెలంగాణ అదోగతి పాలైందని మండి పడ్డారు.

నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పెంచి, ప్రజలను నరకయాతన పెట్టిన జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డలకు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఆరేండ్ల పాలనలో ఇంటింటికి కృష్ణా జలాలను అందించి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పారు.

ఉమ్మడి నల్గొండలో మూడు మెడికల్ కాలేజీల ఏర్పాటు, యాదాద్రి పవర్ ప్లాంట్, దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్, యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం చేసి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని జగదీష్ రెడ్డి అన్నారు. ఇక కేంద్రంలో ఉన్న మోదీ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజలను దోచుకుంటున్నది బీజేపీ ప్రభుత్వం అని జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు.

రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు లక్ష ముప్పై వేల ప్రభుత్వ ఉద్యోగాలను సీఎం కేసీఆర్ కల్పించారని, మరో యాభై వేల ఉద్యోగులాను త్వరలోనే భర్తీ చేస్తున్నారని అన్నారు. ప్రజలను మభ్యపెడుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలను ప్రజలు పట్టించుకోరని పల్లా అన్నారు. సందర్భం ఏదైనా తెలంగాణ సమాజం అంత కేసీఆర్ వెంట నడుస్తుందని అన్నారు.

ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలి

కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ముందుకు సాగాలి

బీజెపి మహిళా మోర్చా సమావేశంలో తరుణ్ చుగ్

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ): ఇంటింటికి వెళ్లి కేసీఆర్ సర్కార్ వైఫల్యాలపై ప్రచారం చేయాలంటూ మహిళా కార్యకర్తలకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ తరుణ్ చుగ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ మహిళా మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మొదట మహిళా మోర్చా నేతలను బాగున్నారా అంటూ తెలుగులో పలకరించారు.. ఇక, బంగారు తెలంగాణ పేరుతో ముఖ్యమంత్రి కుటుంబ పాలన చేస్తున్నారని విమర్శించిన ఆయన.. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కారావు.. అభివృద్ధి కోసం చేసిందేమి లేదు.. ఉద్యమంలోనూ చేసిందేమిలేదన్నారు. ఫాం హౌజ్ లో కూర్చోవడం తప్పా.. ముఖ్యమంత్రి అయ్యాక ఏం చేశావు అంటూ కేసీఆర్‌ను ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆశలు నేరవేర్చలేకపోయారని మండిపడ్డారు.. బంగారు తెలంగాణ పేరుతో అధికారంలోకి వచ్చావు.. మద్యం నిషేధిస్తానని ముఖ్యమంత్రి సీట్లో కూర్చిని మాట మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. అందుకే మహిళలు ఇంటింటికి వెళ్ళి కేసీఆర్ వైఫల్యాలను వివరించాలన్నారు.. అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. ఇక, తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేసిన ఆయన.. దేశంలో పేదల జీవితంలో మార్పుకోసం మోడీ అనేక పథకాలు తీసుకువచ్చారని వివరించారు. మహిళలు, అమ్మాయిల రక్షణ.. అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రధాని మోడీ తీసుకువచ్చారని.. పూర్తిస్థాయి మహిళా కమిషన్ ఏర్పాటు చేశారని.. నారీ పోర్టల్ కూడా మహిళల కోసం ప్రత్యేకంగా తీసుకుని వచ్చారని తెలిపారు. తెలంగాణలో అవినీతి పాలనను పారద్రోలేందుకు తెలంగాణ మహిళా మోర్చా పోరాటం చేయాలని తరుణ్ చుగ్ పిలుపునిచ్చారు. టీఆర్ఎస్‌పై బీజేపీ నాయకురాలు విజయశాంతి ఫైర్ అయ్యారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ నాశనమైందని విమర్శించారు. వాక్సినేషన్ సమయంలో ప్రతిఒక్కరికి ధైర్యం ఇవ్వాల్సిన సమయంలో సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి బయటకు రాలేదని ఆరోపించారు. రాజకీయాల నుంచి కేసీఆర్ తప్పుకున్నారని అనుకుంటున్నానని ఆమె వ్యాఖ్యానించారు. బీజేపీ మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో విజయశాంతి మాట్లాడుతూ వ్యాక్సినేషన్ సమయంలో ప్రజలకు ధైర్యం ఇవ్వాల్సిన సీఎం ఫాంహౌస్ నుంచి బయటకు రాలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి అయితే బయటకు వస్తారని, ప్రజల సమస్యలు తెలుసుకుంటారని అన్నారు. టీఆర్ఎస్‌లో సీఎం నుంచి కిందిస్థాయి నేత వరకు బూతులే మాట్లాడుతున్నారని విజయశాంతి విమర్శించారు.

అంబులెన్స్ సర్వీస్ ప్రారంభించిన సోనూసూద్

శవాల శివకు అండగా ఉంటానని హామీ

హైదరాబాద్,జనవరి19(ఆర్ఎన్ఎ):కరోనా కష్టకాలంలో దేవుడిలా మారి అడిగిన వారికి లేదనకుండా సాయం చేసిన ఆపద్భాందవుడు సోనూసూద్. లాక్‌డౌన్ సమయం నుండి సేవలు చేసుకుంటూ వెళుతున్న సోనూసూద్‌ని కొందరు దేవుళ్ళలా కొలుస్తున్నారు. గుడులు కడుతున్నారు. తెలంగాణలోని కొన్ని ఊర్లలో ఆయనకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సేవా కార్యక్రమాలతో ప్రతి రోజు వార్తలలో నిలుస్తూ వస్తున్న సోనూసూద్ రీసెంట్‌గా తన టీం మెంబర్స్‌కు మొబైల్స్ బహుమతిగా ఇచ్చాడు. ఇక ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి సోనూసూద్ అంబులెన్స్ సర్వీస్‌ని ప్రారంభించాడు. ఇటీవల కొన్ని వ్యాన్స్‌ను కొనుగోలు చేసిన సోనూసూద్ వాటిని అంబులెన్స్‌లుగా మార్చి ప్రజలకు సాయపడేందుకు సిద్ధమయ్యాడు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఏరియాలో సర్వీస్ లాంచ్ చేయగా, రానున్న రోజులలో వీటిని మరింత విస్తృతం చేస్తామని అంటున్నాడు. నిజానికి కరోనా కష్టకాలంలో దేవుడిలా వచ్చి నిరుపేదలను ఆదుకున్న రీల్ విలన్.. రియల్ హీరో 'సోనూసూద్'. కార్మికులు మొదలు.. రైతులు, నిరుద్యోగులు ఇలా ప్రతి ఒక్కరికి అడిగిన సాయం చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఫలానా చోట.. ఫలానా సమస్య ఉందన్న విషయం తన దృష్టికి వస్తే చాలు చేతికి ఎముక లేదన్నట్లుగా సాయం చేసాడు. లాక్‌డౌన్ మొదలు ఇప్పటి వరకు వేలాది పేదలకు సాయం చేశాడు. వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి చూపించాడు. ఇక ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అంబులెన్స్ సర్వీస్‌ని ప్రారంభించాడు ఈ రియల్ హీరో. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఏరియాలో అంబులెన్స్ సర్వీస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ప్రమాదవశాత్తు మరణించి, ఆత్మహత్య చేసుకున్నవారి మృతదేహాలను వెలికితీస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిన శవాల శివను సోనూసూద్ అభినందించాడు. ప్రజలు ఇచ్చిన విరాళాలతో అంబులెన్స్ కొనుగోలు చేసిన శివ.. దానికి 'సోనూసూద్ అంబులెన్స్ సర్వీస్'అని పేరుపెట్టి సేవలు అందిస్తున్నాడు. ఈ అంబులెన్స్ ప్రారంభోత్సవానికి రావాలని సోనూసూద్‌ని ఆహ్వానించాడు శివ. అతని కోరిక మేరకు మంగళవారం ట్యాంక్‌బండ్‌కు వెళ్లిన సోనూసూద్.. శవాల శివ ఇంటికి వెళ్లి సర్‌ప్రైజ్ చేశాడు. శివ చేస్తున్న సేవలను సోనూసూద్ ప్రశంసించారు. భవిష్యత్తులో ఏమి కావాలన్న తాను ఉన్నానని శివకు భరోసా ఇచ్చాడు. ఇక ఈ అంబులెన్స్ సేవలను విస్తృతం చేస్తామని సోనూసూద్ చెప్పాడు.

హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద అంబులెన్స్ సర్వీసును ప్రారంభించిన సినీ నటుడు సోనూసూద్

గబ్బా స్టేడియంలో టీమిండియా ఘన విజయం

ఆసీస్‌ను ఓడించి చరిత్ర సృష్టించిన యువ క్రికెటర్లు
సీనియర్లు లేకున్నా నింపాదిగా ఆడుతూ గెలుపు
1988లో విండీస్ తరవాత ..మళ్లీ ఇప్పుడే విజయం నమోదు
శుభ్‌మన్ గిల్,రిషబ్ పంత్, ఛటేశ్వర పూజరాల అద్భుత ప్రతిభ
టీమిండియాకు సర్వత్రా ప్రశంసలు.. అభినందించిన ప్రముఖులు

బ్రిస్బేన్,జనవరి19(ఆర్ఎన్ఎ): క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ..అలాగే ఎప్పుడు ఎవరు గెలుస్తారో..ఎప్పుడు ఎవరు ఓడిపోతారో కూడా చెప్పలేం. ఒక్కోసారి అంచనాలకు మించి ఫలితాలు వస్తుంటాయి. అలాంటిదే గబ్బా స్టేడియంలో జరిగింది. ఎదురులేని ఆస్ట్రేలియాను టీమిండియా దెబ్బ కొట్టింది. గబ్బా మైదానంలో ఆస్ట్రేలియా ఓడిపోవడమా ? ఇది నమ్మలేని నిజం. అజేయ ఆస్ట్రేలియాను టీమిండియా ఓడించి చరిత్ర సృష్టించింది. మొత్తంగా టీమిండియా చరిత్ర సృష్టించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన నాలుగో టెస్టులో భారత్ తిరుగులేని విజయాన్ని సాధించింది. గాబా పిచ్‌లో ఓటమంటే ఎరుగని కంగారూలకు గెలుపంటే ఎలా ఉంటుందో రుచి చూపించింది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్(89 నాటౌట్) ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 328 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు శుభ్‌మన్ గిల్(91) అద్భుత ఆరంభాన్నిచ్చాడు. ఆ తరువాత చటేశ్వర్ పుజారా(56) అమోఘమైన డిఫెన్స్‌తో ఆసీస్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. ఒకానొక సమయంలో పుజారాను అవుట్ చేయలేని కంగారూ బౌలర్లు అతడి శరీరానికి సైతం బంతులు వేసి బాధించారు. అయినప్పటికీ పుజారా డిఫెన్స్‌ను ఛేదించడంలో విఫలమయ్యారు. ఇక మ్యాచ్ చివరి వరకు పంత్ క్రీజులో పాతుకుపోయి భారత్‌కు మరపురాని విజయాన్ని అందించాడు. దీంతో టీమిండియా 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ఇదిలా ఉంటే గాబా పిచ్‌లో ఆసీస్ ఓటమంటే ఎరుగదు. దశాబ్దాలుగా ఆ పిచ్‌లో ఆసీస్‌ను ఓడించిన దేశం లేదు. ఈ విషయాన్నే మ్యాచ్ ముందు ఆసీస్‌కు చెందిన అనేకమంది మాజీలు కూడా వ్యాఖ్యానించారు. అయితే వారందరి ఆలోచనలనూ తలక్రిందులూ చేస్తూ భారత్ విజయఢంకా మోగించింది. గాబాలో విజయ గర్వంతో గర్జించింది. 4/0తో ఐదో రోజు మ్యాచ్ ఆరంభించిన టీమిండియాకు ప్రారంభంలోనే భారీ దెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ మళ్లీ నిరాశపరుస్తూ కేవలం 7 పరుగులకే పెవిలియన్ చేరాడు. కానీ మరో ఓపెనర్ గిల్(64) మాత్రం పుజారా(8)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుండి నడిపించారు. వీరిద్దరూ ఆసీస్ బౌలర్లకు పరీక్ష పెడుతూ పరుగులు రాబట్టారు. ఈ క్రమంలోనే లంచ్ సమయానికి భారత్ ఒక్క వికెట్ నష్టానికి 83 పరుగుల చేసింది. ఆసీస్ బౌలర్లలో కమిన్స్‌కు ఓ వికెట్ దక్కింది. మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ ఇంకా 245 పరుగులు చేయాల్సి ఉంది. అయితే అంతా డ్రాగా ముగుస్తుందా లేక ఆసిస్ గెలుస్తుందా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా మ్యాచ్ మలుపుతిరిగింది. ఆ సమయంలోనే బ్యాట్స్‌మెన్ పాతుకు పోయి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించారు. . గెలుపు దిశగా అడుగులు వేసారు. అఇప్పటికే 3 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసిన భారత్ విజయానికి కేవలం 146 పరుగులు దూరంలో ఉంది. ఇంకా మ్యాచ్‌లో 37 పరుగులు మిగిలాయి. తొలి సెషన్ నెమ్మదిగా సాగినా.. లంచ్ తరువాత భారత్ వేగం పెంచింది. 4 రన్ రేట్‌తో 100 పరుగులు రాబట్టింది. అయితే మూడో సెషన్‌లో కూడా ఇదే జోరుతో ఆడితే 37 ఓవర్లలో 146 పరుగులు సులభంగా సాధించగలుగుతుంది. అదే జరిగితే బ్రిస్బేన్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించనట్లే అవుతుంది. దశాబ్దాల నుంచి ఈ పిచ్‌లో ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న ఆసీస్‌ను ఆఖరి పంచ్ ఇచ్చి ఇంటికి గర్వంగా వెనుదిరుగుతుంది. అలాంటి సమయంలో అంతా

తన సత్తా చాటింది. అత్యంత బలంగా ఉన్న ఆసీస్ జట్టుకు ఝలక్ ఇచ్చింది. అపూర్వమైన రీతిలో బోర్డర్ గవాస్కర్ సీరీస్‌ను సొంతం చేసుకున్నది. నిజానికి గబ్బా అంటే ప్రత్యర్థులకు హడల్. ఈ పిచ్‌పై మ్యాచ్ ఆడాలంటే.. విదేశీ ఆటగాళ్లు వణికిపోతారు. బౌంబే లెత్తించే బౌన్సర్లు.. రోజులు మారుతుంటే మెలికలు తిరిగే ఈ పిచ్‌పై .. ఎవరు ఆడాలన్నా గజగజలాడి పోతారు. కానీ రహానే నేతృత్వంలోని టీమిండియా ప్లేయర్లు అసాధారణ రీతిలో అసమాన ప్రతిభను ప్రదర్శించింది. గబ్బా మైదానంలో స్వంత ప్లేయర్లనే వణికించారు. 1980 దశకంలో పటిష్టమైన వెస్టిండీస్ జట్టు మాత్రమే ఈ పిచ్‌పై విజయం సాధించినట్లు రికార్డు ఉన్నది. 1988వ సంవత్సరంలో మైటీ విండీస్ ఆ ఘనతను దక్కించుకున్నది. ఆ సమయంలో విండీస్ జట్టులో మాల్కమ్ మార్షల్, ప్యాట్రిక్ ప్యాటర్సన్, కర్ట్లీ ఆంబ్రూస్, కర్ట్నీ వాల్ష్ లాంటి మేటి బౌలర్లు ఉన్నారు. మరోవైపు ఆసీస్ జట్టులోకైలీ మినోగ్, రిక్ ఆస్లే, రాబర్ట్ పామర్, బిల్లీ ఓసియన్ లాంటి బ్యాట్స్‌మెన్ ఉన్నారు. అయితే 33 ఏళ్ల తర్వాత గబ్బా కోటను టీమిండియా బద్దలు కొట్టడం క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు. ఎక్కువ శాతం యువ ఆటగాళ్లు ఉన్న జట్టుతో ఈ విజయాన్ని అందుకోవడం మరీ ప్రత్యేకం. అయితే ఈ సిరీస్‌లో భారత్ 20 ఆటగాళ్లను రంగంలోకి దింపాల్సి వచ్చింది. విరాట్ మధ్యలో వెళ్లిపోవడం.. ఆ తర్వాత కొందరు ఆటగాళ్లకు గాయాలు కావడం.. స్కానింగ్‌కు వెళ్లిన ప్లేయర్లు టూర్ నుంచి తప్పుకోవడం.. ఎన్నో ఒడిదిడుకులు ఎదుర్కొన్న భారత్.. బ్రిస్బేన్ టెస్టులో సుమధురమైన విజయంతో గబ్బా కోటను బద్దలు కొట్టింది.

'ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్' పథకం కింద జనవరి 20న ఉత్తర్ ప్రదేశ్ లో 6 లక్షల మందికి లబ్ధి

హైదరాబాద్, జనవరి 19ఫప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఉత్తర్ ప్రదేశ్ లోని 6.1 లక్షల మంది లబ్ధిదారులకు 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ (పిఎంఎవై-జి)' కింద జనవరి 20, 2021 మధ్యాహ్నం 12 గంటలకు ఆర్థిక సహాయాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సహాయం కింద 5.30 లక్షల లబ్ధిదారులకు తొలి విడత వాయిదాను విడుదల చేస్తారు. అలాగే ఇప్పటికే పిఎంఎవై-జి కింద తొలి విడత వాయిదా అందుకున్న వారికి రెండో విడత ఆర్థిక సహాయాన్ని 80 వేల మంది లబ్ధిదారులకు అందజేయనున్నారు.

పథనమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్

2022 నాటికి అందరికీ గృహాలు అని ప్రధాన మంత్రి శంఖం పూరించారు. ఇందుకు 2016 నవంబర్ 20న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా ఈ పథకం కింద 1.26 కోట్ల ఇళ్లను నిర్మించారు. పిఎమ్ఎవై-జి లబ్ధిదారులకు నూరు శాతం గ్రాంటు కింద 1.20 లక్షలు (మైదాన ప్రాంతంలో), 1.30 లక్షలు (కొండ రాష్ట్రాలు/ఈశాన్య రాష్ట్రాలు/క్లిష్టమైన ప్రాంతాలు/ జమ్ము, కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం, లద్దాఖ్, ఐఎపి/ ఎల్‌డబ్ల్యుఇ జిల్లాలకు) ఇస్తారు

పిఎంఎవై-జి లబ్ధిదారులు యూనిట్ సహాయంతో పాటు 'మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్)' కింద నైపుణ్యం లేని కార్మికుల వేతనాలు, స్వచ్ఛభారత్ మిషన్ -గ్రామీణ్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఇతర ప్రత్యేక నిధుల కింద టాయిలెట్ల నిర్మాణానికి రూ. 12,000 లు అందజేస్తారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

-కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ పరిశీలన

రాజన్న సిరిసిల్ల, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి):ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీ కృష్ణ భాస్కర్ పరిశీలించారు.తంగళ్లపల్లి మండల కేంద్రం, నేరెళ్ళ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో సందర్శించి, వైద్యులకు ,ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.కోవిడ్ మహమ్మారిని అంతం చేసేందు కు శాస్త్రవేత్తలు 9 నెలల పాటు శ్రమించి వ్యాక్సిన్ ను తయారు చేశారని కలెక్టర్ అన్నారు. ఎంత మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు, ఎంత మందికి వ్యాక్సిన్ వేశారు అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ పై అందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొదటి విడతలో ఫ్రంట్ లైన్ వర్కర్లకు వ్యాక్సినేషన్ చేసే ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యాక్సినేషన్ కేంద్రాలలో తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు.ఈ సందర్భనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరం నిధుల సేకరణ కోసం బైక్ ర్యాలీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి):శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ శ్రీ రామ మందిర నిర్మాణ నిధి సేకరణ ఉద్యమంలో లో భాగంగా వేములవాడ ఖండ ఆధ్వర్యంలో పట్టణంలోని తిప్పాపూర్ నుండి కోరుట్ల బస్టాండ్ వరకు యువకులతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి రాష్ట్రీయ విభాగ్ సంఘచాలక్ మాన్యశ్రీ బూర్ల దక్షిణామూర్తి విభాగ కార్యవాహ శ్రీ పాక సత్యనారాయణ గారు ఖండ సంయోజక్ గడప కిషోర్ రావు ,సహ సంయోజక్ నాగుల రాము ,జింక అనిల్ , ప్రచార ప్రముక్ మహేష్ , కరసేవక్ గర్షకుర్తి వెంకన్న ,పి సుధాకర్ ,కె పుల్లరెడ్డి , సమితి సభ్యులు నంది శివకుమార్ , గోపాల్ జక్కుల తిరుపతి , రాజేందర్ సంతోష్ బాబు చిలుక గట్టు, రాకేష్ , యాశ్వంత్,విశాల్ తదితరులు ఉన్నారు

తెలంగాణ ఉద్యమంలో మరణించిన అమరుని కుటుంబానికి ఆర్థిక సహాయం

-మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో కుటుంబ సభ్యులకు 10 లక్షల రూపాయల చెక్కును అందించిన జిల్లా కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మరణించిన అమరుని కుటుంబానికి మంత్రి కె. తారకరామారావు గారి ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.వివరాలలోకి వెళితే గంభీరావుపేట మండలం జిల్లెల్లపల్లి గ్రామానికి చెందిన సల్వల నారాయణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఉద్యమం చేసి ప్రాణాలను అర్పించాడు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఆదేశాలతో మంగళవారం కలెక్టర్ అమరుని భార్య శ్రీమతి నర్సవ్వ కు 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో గంభీరావుపేట జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీపీ కరుణ, గ్రామ సర్పంచ్, తదితరులు ఉన్నారు.

కరోనా వ్యాక్సిన్‌పై అపోహలు నమ్మవద్దు

- జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు

రాజన్న సిరిసిల్ల, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి): కరోనా వ్యాక్సిన్ పై దుష్ప్రచారం,అపోహలను నమ్మవద్దుని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు అన్నారు, చందుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం కరోనా వ్యాక్సిన్, టీకా పంపిణీ కార్యక్రమాన్ని చందుర్తి, రుద్రంగి ఎంపీపీ లు బైరగోని లావణ్య రమేష్, గంగం స్వరూపరాణి జెడ్పి టి సి లు నాగం కుమార్, గట్ల మీ నయ్య లు ప్రారంభించారు,మొదటి టీకాను ఆస్పత్రి స్వీపర్ నేరెళ్ల నర్సవ్వ కు వేశారు, ఈ సందర్భంగా కరోన టీకా వేసే కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కరోనా టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతగా నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకా పంపిణీ చేయడం జరిగిందని రెండో విడతలో జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో ప్రభుత్వ వైద్య సిబ్బందికి, అంగన్వాడీ సిబ్బంది కి టీకాలు వేయడం జరుగుతుందన్నారు, జిల్లాలో దాదాపు 60 శాతం టీకాల పంపిన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు, టీకాలు వేసుకుంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయనే అపోహలు నమ్మవద్దున్నారు, మొదటి విడత టీకా తీసుకున్నవారు తప్పకుండా రెండో విడత డోసు ఇరవై ఎనిమిది రోజులకు తీసుకోవాలన్నారు, దశలవారీగా అందరికీ ఈ టీకాను వేస్తామన్నారు,ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు,రుద్రంగి, చందుర్తి తాసిల్దార్ లు తాఫజుల్ హుస్సేన్, నరేష్,ఎంపీడీవోలు రవీందర్, శంకర్ నాయక్ వైద్యాధికారులు ఎండి మసూద్, రాజశేఖర్, అంగన్వాడి సూపర్వైజర్ లు అరుణ, రాజేశ్వరి, నాయకులు పులి సత్యం,అన్ని గ్రామాల ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు,

5వ డివిజన్‌లో కరోనా వ్యాక్సిన్‌కు శ్రీకారం

-ప్రారంభించిన కార్పొరేటర్ జహెరా బాను..కార్పొరేటర్లు

రాజన్న సిరిసిల్ల, జనవరి 19 (నేటినిజం ప్రతినిధి):నగరంలోని 5వ డివిజన్ హుస్సేనీ పుర అర్బన్ హెల్త్ సెంటర్లో మంగళవారం కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ జహెరా బాను ప్రారంభించారు. కరోనా వారియర్స్ అయిన వైద్య సిబ్బందికి వ్యాక్సిన్ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ వరుణా, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, పవన్ కుమార్, ఎంఐఎం యువనేత అజహర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి సెంటర్‌లో హై డ్రామా

దేవినేని ఉమ దీక్షకు పోలీసుల నిరాకరణ
అరెస్ట్ చేసి పమిడిముక్కలకు తరలింపు
సర్కారు తీరుపై మండిపడ్డ దేవినేని
చర్చకు రాకుండా డ్రామాలా అని మంత్రి నాని ఎద్దేవా

విజయవాడ,జనవరి,19(ఆర్ఎన్ఎ): గొల్లపూడి సెంటర్‌లో హై డ్రామాల మధ్య తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమాను అదుపులోకి తీసుకున్న పోలీసులు పమిడిముక్కల పీఎస్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు భారీగా చేరుకున్నారు. గొల్లపూడి సెంటర్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. మంత్రి కొడాలి నాని సవాల్‌కు ప్రతి సవాల్‌గా టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా దీక్షకు యత్నించగా దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మాజీమంత్రి నెట్టెం రఘురామ్, తదితరులు అక్కడికి వచ్చి ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. విజయవాడ వేదికగా టీడీపీ-వైసీపీ నేతలు సవాళ్లు విసురుకున్నారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినే